ప్రజా సంక్షేమమే ధ్యేయం

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- పెదగదిలిలో గడప గడపకు మన ప్రభుత్వం



పెదగదిలిలో మహిళతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ

ఆరిలోవ: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 12వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయం సిబ్బందితో కలిసి ఆయన కొండవాలు ప్రాంతం పెదగదిలిలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల వివరాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రాధాన్యత గురించి వివరించారు. వాటి వల్ల ఎలాంటి లబ్ధి పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం గురించి అహర్నిశలు ఆలోచిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి కూడా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లాల ఎస్సీ విభాగం ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, స్థానిక నాయకులు కనకరాజు, కొండమ్మ, సచివాలయం కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



దుప్పట్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయిబాబా 98వ జయంతి వేడుకలను శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. నగరంలోని ఆశ్రేయ హోమ్‌లెస్ షెల్టర్‌లోని వృద్ధులు, చిన్నారులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. స్వామివారి చిత్రపటం, విభూతి, కేకులు, నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి విద్యావిహార్ స్కూల్ ప్రిన్సిపాల్ అయ్యగారి కౌసల్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రమిదల తయారీ



ప్రమిదలను ప్రదర్శిస్తున్న దివ్యాంగ విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–12లోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల పాఠశాలలో బుధవారం దీపావళి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు తయారు చేసిన ప్రమిదలను ప్రదర్శించారు. మట్టిని వినియోగించి వివిధ రకాల రంగులతో ప్రమిదలు తయారు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సంస్కర్త ఐఈ రంగారావు, షిప్పింగ్ ఇంజినీర్ రమేష్, వర్మ, పాఠశాల నిర్వాహకుడు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన చిన్నారులు



చిన్నారులు నృత్య ప్రదర్శన

బీచ్ రోడ్డు: చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. బుధవారం శ్రీప్రకాష్ విద్యా నికేతన్ ఆధ్వర్యంలో కిడ్స్ డే వేడుకలను వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా దీపావళి అనే అంశాన్ని చిన్నారులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరి



వెటర్నరీ కాలనీలో అవగాహన కల్పిస్తున్న క్రైం పోలీసులు

ఆరిలోవ: అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ద్వారకా క్రైం ఏసీపీ వెంకటరావు సూచించారు. హనుమంతవాక వద్ద వెటర్నరీ కాలనీ అపార్ట్‌మెంట్‌లో బుధవారం సాయంత్రం ద్వారకా క్రైం పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ దొంగతనాలను అరికట్టడానికి నగర సీపీ ఆదేశాలతో పోలీసులు చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రతి అపార్టుమెంట్ కమిటీ సభ్యులు ముందుకు వచ్చి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం సీఐ ఇమాన్యుయేల్ రాజు, ఎస్‌ఐ రుక్మాంగదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏయూ సమాచారమ్

ఆచార్య ప్రసన్నశ్రీకి అభినందనలు



ఆచార్య ప్రసన్నశ్రీని అభినందిస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆచార్యురాలు ఎస్.ప్రసన్నశ్రీని విద్యా విభాగంలో బుధవారం సత్కరించారు. ఇటీవల భారత ప్రభుత్వ పాఠశాల విద్యా శాఖ, అక్షరాస్యత విభాగం నేషనల్ అడ్వైజరీ కౌన్సిల్ సభ్యురాలిగా ఆమెను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా ఆమెను విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు సన్మానించి, అభినందించారు. అనంతరం ఆచార్య ప్రసన్నశ్రీ మాట్లాడుతూ తనను గుర్తించి ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వ విద్యా శాఖకు, ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఆచార్య నాగరాజ కుమారి, అధ్యాపకులు, విద్యార్థులు, విశ్రాంత ఆచార్యులు, పాల్గొన్నారు.

కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విజేతలకు అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఐ.విజయబాబు

మద్దిలపాలెం : విజిలెన్ వారోత్సవాలలో భాగంగా డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో వక్తృత్వ, చిత్రలేఖన, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కృష్ణా కళాశాల విద్యార్థులు బహుమతుల సాధించారు.

- వ్యాస రచన పోటీలో ప్రథమ ఎం.గణేష్‌కుమార్, ద్వితీయ ఎల్.కిరణ కుమార్, తృతీయ ఎస్.కె.ఆలీముని బహుమతులు సాధించారు.
- చిత్ర లేఖనంలో ప్రథమ సాయి లలిత, ద్వితీయ ఎ.కుమారస్వామి, తృతీయ బహుమతి ఎన్.మౌలిక దక్కించుకున్నారు.
- వక్తృత్వ పోటీలలో ప్రథమ ఎస్.కె.ఆలీమున్ని, ద్వితీయ ఎం.గణేష్‌కుమార్, తృతీయ ఎం.చరణ్ సాధించారు. విజేతలకు పోర్టు ట్రస్ట్ చైర్మన్ అంగముత్తు దర్శించుకున్నారు. విజేతలను కళాశాల ప్రాంగణంలో సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.వి జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జయతో పాటు, అధ్యాపకులు పోలా ఉమమాహేశ్వరరావు, శ్యాముల్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్లకు సత్కారం



విజయచందర్‌ను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా నియమితులైన పేర్ల విజయచందర్‌ను తీర ప్రాంత వాడబలిజ మత్స్యకారుల సంక్షేమ సంఘం ప్రతినిధులు సత్కరించారు. ఈ మేరకు విజయచందర్‌ను బుధవారం తన నివాసంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ సలహాదారు మూగి సూర్యనారాయణ, అధ్యక్షుడు మూగి శ్రీరామమూర్తి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మత్స్యకారులకు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. పథకాల అమలుతో పాటు రాజకీయంగాను మత్స్యకారులకు అండగా నిలుస్తుందన్నారు. అనంతరం పలు మత్స్యకారుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రామకృష్ణ, కోశాధికారి పేర్ల భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ఏఎంఏఎల్ ప్రథమ స్థానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్సిటీ ఇంటర్ కళాశాలల మహిళా వాలీబాల్ పోటీలలో అనకాపల్లి ఏఎంఏఎల్ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పోటీలలో విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు బుధవారం ట్రోఫీ అందజేశారు. ద్వితీయ స్థానంలో కృష్ణా కళాశాల జట్టు, తృతీయ స్థానంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, ఎడ్యుకేషన్ విభాగాధిపతి సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు



బాణసంచా విక్రయాల కోసం మైదానంలో సిద్ధం చేస్తున్న దుకాణాలు

ఎంవీపీ కాలనీ: స్థానిక ఏఎస్ రాజా మైదానంలో బాణసంచా విక్రయాలకు ఏర్పాట్లు చకచక జరుగుతున్నాయి. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఏటా ఈ మైదానంలో బాణసంచా విక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 50 వరకు దుకాణాలను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. గతంలో 70 వరకు దుకాణాలకు అనుమతులు ఇచ్చినప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థం, పార్కింగ్ సౌకర్యార్థం ఈ ఏడాది 50 దుకాణాలకు జీవీఎంసీ అనుమతి ఇచ్చింది. జీవీఎంసీ అనుమతితో పాటు ఫైర్ సేఫ్టీ, విక్రయాల లైసెన్స్ పొందిన దుకాణదారులను మాత్రమే విక్రమాలకు అనుమతిస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు తెలిపారు. అయితే చాలా మంది దుకాణదారులు ఈ మేరకు అనుమతులు పొందిన నేపథ్యంలో శుక్రవారం నుంచి ఈ మైదానంలో విక్రయాలు ప్రారంభం కానున్నాయి.

బాణసంచా కాల్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలి

ఆరిలోవ: దీపావళికి బాణసంచా కాల్చినప్పుడు తప్పనిసరిగా అప్రమత్తంగా ఉండాలని ఎల్వీపీ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ ముగుందన్ రాజరాజన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా కొనుగోలు చేసిన బాణసంచాను ఇంట్లో పిల్లలకు అందకుండా అట్టపెట్టెలో పెట్టి దూరంగా ఉంచాలన్నారు. గ్యాస్ సిలిండర్లకు దూరంగా ఉంచాలన్నారు. వాటిని రెండు రోజుల పాటు ఎండలో బాగా ఆరబెట్టాలని సూచించారు. పిల్లలు టపాకాయలు కాల్చినప్పుడు పెద్దలు పర్యవేక్షించాలన్నారు. అందుబాటులో బకెట్‌తో నీరు ఉంచుకోవాలన్నారు. కళ్లజోడు ధరించి శ్రేయస్కరమని చెప్పారు. ఎలాంటి ప్రమాదం జరిగినా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆధార్‌తో బ్యాంకు ఖాతా తెరిచి వ్యక్తి మోసం

మర్రిపాలెం: గతంలో ఓ ఇంట్లో అద్దెకు ఉండి.. యజమాని ఆధార్ కార్డు తీసుకుని వేరే చోట బ్యాంకు ఖాతా తెరచి ఇంటి యజమానిని ఓ వ్యక్తి మోసం చేసిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్‌లో సత్తి పద్మావతి అనే మహిళ ఇంట్లో గొంప నాయుడు అనే వ్యక్తి చాలా కాలంగా అద్దెకు ఉన్నాడు. 2020లో ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. ఆ సమయంలో గ్యాస్ కనెక్షన్ కోసం సదరు యజమానిని ఆధార్ కార్డు అడిగాడు. ఆమె ఇవ్వడంతో ఆ వ్యక్తి గాజువాకలోని ఓ బ్యాంకులో ఆధార్ కార్డుతో వేరే అకౌంట్‌ను తెరచి, లావాదేవీలు కొనసాగిస్తున్నాడు. అనుమానం వచ్చిన ఆమె తనకు ప్రభుత్వం ఇచ్చే పథకాల సొమ్ము తన అకౌంటుకు రావడం లేదని సచివాలయంలో ఆరా తీయగా.. ఆమెకు గాజువాకలోని ఓ బ్యాంకులో ఉన్న ఖాతాలో నగదు జమవుతుందని వారు చెప్పడంతో ఆమె నివ్వెరపోయింది. దీంతో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి కేసు దర్యాప్తు చేపట్టారు.

పొరపాట్లకు తావులేకుండా ఓటరు జాబితా

- జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్
- ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్‌వోలతో సమీక్ష



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

తాటిచెట్లపాలెం: ఓటరు జాబితాలో పొరపాట్లు, క్రమరాహిత్యాలు లేకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా డూప్లికేట్ ఓట్లను తొలగించే క్రమంలో జాగ్రత్త వహించాలని, ఒకటికి రెండు సార్లు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధి ఈఆర్వో, ఏఈఆర్వో, బీఎల్‌వో, సూపర్‌వైజర్లతో అక్కయ్యపాలెం షాదీఖానాలో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే డోర్ నంబర్‌లో అధిక ఓట్లు ఉన్నా, ఒకరి పేరు మీద రెండు ఓట్లు ఉన్నా.. బీఎల్‌వోలు స్వయంగా ఆయా ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని తెలిపారు. అన్ని వివరాలు సరిపోయిన తరువాతే ఓట్లను తొలగించాలన్నారు. డూప్లికేట్ ఓట్ల తొలగింపులో సంబంధిత ఓటరు నుంచి సమ్మతి తీసుకోవాలని స్పష్టం చేశారు. చిరునామా మారినా.. వలస వెళ్లిపోయినా వారి వివరాలను కచ్చితంగా తెలుసుకోవాలని, అనంతరం చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. బీఎల్‌వోలు ఓటు సవరణలు ఈఆర్‌వో 2.0 ద్వారా ఆన్‌లైన్‌లో తప్పక అప్‌లోడ్ చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని పాటిస్తూ, జాబితా రూపకల్పనలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, చిన్న తప్పు కూడా లేకుండా అత్యంత పారదర్శకతతో కూడిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించేందుకు అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో డీఆర్‌వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జీవీఎంసీ జోనల్ కమిషనర్, తహసీల్దార్లు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే విద్యార్థుల ఉన్నతి

దాబాగార్డెన్స్ : ఏవీఎన్ కళాశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ ఓషన్ సిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అండ్ మెంటరింగ్‌పై బుధవారం సదస్సు నిర్వహించారు. సైకాలజిస్ట్ పి. రవికాంత్ విద్యార్థుల భవిష్యత్‌కు మెంటరింగ్ ఆవశ్యకత, స్టార్టప్ కంపెనీలు ప్రారంభించడానికి కావల్సిన నైపుణ్యాలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ జీవన నైపుణ్యాలు విద్యార్థుల అభివృద్ధికి ఏ విధంగా దోహదపడతాయో వివరించారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ ఓషన్ సిటీ అధ్యక్షురాలు రాజకుమారి, కార్యదర్శి భరాతి రోఫ్రా, కోశాధికారి సాయిలక్ష్మి, సభ్యులు స్వర్ణలత, భవ్య, కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి డి. సంతోష్‌కుమార్, ఎస్. అనంతలక్ష్మి, ప్రదీప్‌కుమార్, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు 'గిడుగు' సేవలు అపూర్వం



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

తాటిచెట్లపాలెం: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో తెలుగు భాషకు గొడుగు – గిడుగు అనే అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.వేణు ప్రసంగిస్తూ తెలుగు భాషకు.. ముఖ్యంగా వ్యవహారిక భాష ఉనికికి, వ్యాప్తికి కృషి చేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి పంతులు అని కొనియాడారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ ఆధునిక భాషా శాస్త్రంలో అసదృశ విద్వాంసుడు, దీక్షా పరుడు, నిర్భయుడు, తెలుగు సవరల భాషల అదృష్టదీపకుడు, మహామనిషి గిడుగు రామమూర్తి పంతులు అని కితాబిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సవర భాష వ్యాప్తికి కృషి చేసి నిఘంటువులను తయారు చేశారన్నారు. ఆయన కృషికి అప్పటి ప్రభుత్వం రావ్ బహుదూర్ బిరుదుతో సత్కరించిందని, ఆంధ్ర విశ్వవిద్యాలయం కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించిందని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరి రమణ, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, భాగవతుల సత్యనారాయణ మూర్తి, పి.గణేశ్వరరావు, గండికోట సుబ్బలక్ష్మి, పి.వి.ఆర్.కుమార్ పాల్గొన్నారు.

రెయిలింగ్ పనులకు శంకుస్థాపన



కొండవాలు రెయిలింగ్ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, మేయర్ గొలగాని

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు బాలాజీనగర్ దరి కొండవాలు ప్రాంతం బీసీ కాలనీలో రెయిలింగ్ నిర్మాణానికి ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ, మేయర్ మాట్లాడుతూ కొండవాలులో మెట్ల మార్గంలో పైకి ఎక్కిదిగేటప్పుడు స్థానికులు ఇబ్బందిపడుతున్నారన్నారు. దీంతో ప్రజల సౌకర్యార్థం ఇక్కడ మెట్లకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లంపల్లి రాజబాబు, సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, సూర్యారావు, పి.ఐ.బాలరాజు, జ్యోతి ప్రకాష్, హుస్సేన్, కనకరాజు, శ్రీను పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ద్వారకా ఏసీపీ మూర్తి



సదస్సులో విద్యార్థులు, ఆటో డ్రైవర్లు, వాహనచోదకులు

ఆరిలోవ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని ద్వారకా ఏసీపీ ఆర్‌వీఎస్ మూర్తి కోరారు. ఆరిలోవ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విమ్స్ ఆవరణలో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనచోదకులు ట్రాఫిక్ నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం మత్తులో డ్రైవింగ్, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలు జరగకుండా పోలీసులు తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం అవసరమన్నారు. ఎక్కువగా మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని తెలిపారు. మరో వైపు సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్లకు వచ్చే లింక్‌లు తెరవకూడదన్నారు. పిల్లలు సెల్‌ఫోన్లలో ఆటలు ఆడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, తల్లిదండ్రులు వారిని కనిపెడుతుండాలని ఆయన సూచించారు. విశాఖ ఏజెన్సీతో పాటు ఒడిశా, మధ్యప్రదేశ్‌ల నుంచి గంజాయి సరఫరా అవుతుందన్నారు. యువత గంజాయి, మత్తు పదార్థాలకు గురికాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ ప్రసాద్, ఆరిలోవ లా అండ్ ఆర్డర్ సీఐ సోమశేఖర్ మాట్లాడుతూ వాహనచోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహనచోదకులు, యూనియన్ నాయకుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఈ సదస్సులో ఎన్‌హెచ్‌ఏఐ సైట్ ఇంజినీర్ కరీం, రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి రవికుమార్, పాఠశాల విద్యార్థులు ఆటో డ్రైవర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కార్పెంటర్ దుర్మరణం

న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యుల ఆందోళన



మృతుడు అప్పలాచారి(ఫైల్)



ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, స్థానికులు

ఆరిలోవ: లారీ ఢీకొని ఓ కార్పెంటర్ మృతి చెందిన ఘటన ఓల్డ్ డెయిరీ ఫారం కూడలిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై స్థానికులు, మృతుడు బంధువులు ఆరిలోవ పోలీస్ స్టేషన్ వద్ద న్యాయం చేయాలంటూ బుధవారం ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ 12వ వార్డు దుర్గానగర్‌కు చెందిన కోరుకొండ అప్పలాచారి(36) కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయన శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో పని చేసుకుని మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై విశాఖ బయలుదేరాడు. జాతీయ రహదారిపై ఓల్డ్ డెయిరీ ఫారం వద్ద ఆరిలోవ వైపు తిరిగే సమయంలో జూ పార్కు వైపు నుంచి నగరంలోకి వెళ్తున్న లారీ వెనక నుంచి ఢీకొంది. దీంతో అప్పలాచారి కిందపడి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా లారీ యజమానిని పిలిపించి తమ కుటుంబానికి న్యాయం చేసేలా చూడాలని మృతుడు భార్య, పిల్లలు, బంధువులు, దుర్గానగర్ వాసులు బుధవారం ఆరిలోవ పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఫిర్యాదు చేయకుండా ఎలాంటి చర్యలు చేపట్టలేమని సీఐ సోమశేఖర్ వారికి నచ్చజెప్పారు. చివరకు సాయంత్రం ఈ ప్రమాదంపై మృతుడు భార్య జ్యోతి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కార్తీక పూజకు శివాలయాలు ముస్తాబు



కొత్త వెంకోజీపాలెం జ్ఞానలింగేశ్వర ఆలయం

మద్దిలపాలెం : కార్తీక మాసం పూజలకు శివాలయాలు ముస్తాబవుతున్నాయి. ఇప్పటికే ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కొత్త వెంకోజీపాలెంలోని శ్రీగౌరీ జ్ఞానలింగేశ్వర ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకూ కార్తీక మాస పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి సూర్య ప్రకాశ్‌శర్మ తెలిపారు. 14వ తేదీ ఉదయం 10 గంటలకు మంగళ ధ్వనితో ప్రారంభమై అఖండ దీపారాధన, విఘ్నేశ్వర పూజ, పంచ పల్లవ సహిత పంచామృత నారికేల అభిషేకాలు జరుగుతాయన్నారు. అదే రోజు సాయంత్రం 6.30 గంటలకు ఆకాశ దీప ప్రజ్వలన ధ్వజ స్తంభ శిఖరాగ్ర భాగంలో ప్రారంభం జరుగుతుందని పేర్కొన్నారు.

మోసాలపై విద్యార్థినులకు అవగాహన అవసరం



బహుమతులు పొందిన విద్యార్థినులతో నిర్వాహకులు

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థినులకు పోటీలు నిర్వహించారు. విశాఖపట్నం పోర్టు ట్రస్ట్, భారతీయ జీవిత బీమా సంస్థ విశాఖ డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో వ్యాసరచన, ఎలక్యూషన్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. సమాజంలో జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు అవగాహన ఉండాలని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల రాజనీతిశాస్త్ర విభాగం నుంచి జి. జ్యోతి, డాక్టర్ బి. నాగమణి, ఎకనామిక్స్ విభాగం నుంచి డాక్టర్ కేఎల్ శిరీష, ఐక్యూఏసీ కన్వీనర్ డి. అరుణపద్మ, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.